ఇదేనా రైతు ప్రభుత్వం

3



ప్రజాజ్యోతి
నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025 । పేజీలు 4

# ఆశావహుల్లో.. నిరాశ




## స్థానికం కోసం ఎదురు చూపులు ఈసారి త్రిముఖ పోరు

నాగిరెడ్డిపేట్,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి): గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల్లో నిరాశ కలిగిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారం యంత్రాంగం అన్ని ఏర్పా ట్లు పూర్తిచేసినా సెప్టెంబర్ 30 లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీ జరుగుతాయా అనే సందేహం అందరికీ కలుగుతున్నది. ఇప్పటికే పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. పరిషత్‌ల గడువు సైతం పూర్తయ్యింది. ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీల పాలన చేస్తున్నారు. కాగా పాలక వర్గాలు లేకపోవడంతో నిధులు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

### ఎదురుచూపులు

స్థానిక ఎన్నికల కోసం ఆశావహులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సేవ చేయాలన్న ఆకాంక్షతో రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్న అనేక మందికి ఎన్నికల వాయిదా నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. చాలామంది అభ్యర్థులు ఇప్పటికే గ్రామాల్లో పర్యటనలు,సామాజిక కార్యక్రమాలు ప్రారంభించారు.

### త్రిముఖ పోరు..

గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది.అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంతమంది బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరినప్పటికీ, ఇంకా బిఆర్ఎస్ లో తాజా మాజీ ప్రజాప్రతినిధుల శాతం అధికంగానే ఉంది. గ్రామాల్లో ఇంకా ఆ పార్టీ కేడర్ బలంగా ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఊపుతో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలతో పోటీ హెూరాహెూరీగా ఉండనుంది. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చామనే అంశంతో కాంగ్రెస్ ముందుకు వెళ్లనుంది. గ్రామాలు, పట్టణాల్లో ఇటీవలి కాలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించడం, సన్న బియ్యం పథకం వంటి అంశాలు తమకు కలిసి వస్తాయని ఆ పార్టీ భావిస్తోంది.

బీఆర్ఎస్ తమకున్న కేడర్, గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని అభిప్రాయపడుతోంది.ఇప్పటికే ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు తరచూ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.బీసీ రిజర్వేషన్లు అమలయ్యే పక్షంలో తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేనంతగా బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రత్యామ్నాయ పార్టీగా ఎదగడానికి స్థానిక సంస్థల ఎన్నికలు గేట్‌వేగా ఉంటాయని ఆ పార్టీ నాయకత్వం అనుకుంటోంది. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓటు బ్యాంకును సద్వినియోగం చేసుకుని.. సరైన అభ్యర్థులను నిలిపితే ఫలితం ఉంటుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రభుత్వం నుంచి స్పష్టత ఎప్పుడు?..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వం త్వరలో ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుని, ఎన్నికల తేదీలను ప్రకటించాలని ప్రజలు,వివిధ వర్గాల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి.



2

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

పోచారం ప్రాజెక్ట్‌లోకి ఇన్ ఫ్లో



4



దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలి

2

## ఎస్సైగా రాజు బాధ్యతలు స్వీకరణ



రాజంపేట సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి). రాజంపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన దత్తాత్రి గౌడ్ స్థానంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆయనను నియమించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. అలాగే ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తండాల్లో కల్యాణలక్ష్మి ధ్రువీకరణ..

**రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రదీప్**



గాంధారి సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి). గాంధారి మండలంలోని బీర్మల్ తాండ, గొల్లడి తాండ, సోమారం, కొత్తబాది, జెమిని తాండ, అవసలికుంట తాండలలో శనివారం రోజు కళ్యాణ లక్ష్మి ధృవీకరణ పరిశీలన నిర్వహించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రదీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ "కళ్యాణ లక్ష్మి పథకం పేద కుటుంబాల ఆడపిల్లల వివాహానికి ఆర్థిక సహాయం అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్య కార్యక్రమం" అని పేర్కొన్నారు.ధృవీకరణలో దరఖాస్తుల వివరాలు పరిశీలించి, అర్హులైన వారికి త్వరలోనే ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ప్రదీప్ స్పష్టం చేశారు

3

## యూరియా సరఫరా

గాంధారి సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి). గాంధారి మండలంలోని మతు సంగం పిఏసిఎస్ ఉపసొసైటీ లో యూరియా పంపిణీ చేపట్టారు. వ్యవసాయ అధికారి రాజలింగం మాట్లాడుతూ%ొ% "అవసరానికి అనుగుణంగా ఎరువుల పంపిణీ కొనసాగుతోంది" అని తెలిపారు.ముదేల్లి పిఏసిఎస్‌లో 9.99 మెట్రిక్ టన్నులు, మతు సంగం పిఏసిఎస్‌లో 9.99 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. అనంతరం గాంధారి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు.









# దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 13. (ప్రజాజ్యోతి). కామారెడ్డి పట్టణంలో శనివారం కలెక్టర్ పర్యటించి భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న హౌసింగ్ బోర్డ్ వైకుంఠధామం యందు అత్యవసరంగా ఏర్పాటు చేయబడుతున్న రోడ్డు పనులను మరియు వాటర్ సప్లై ఫిల్టర్ బెడ్ ను సందర్శించి వెంట ఉన్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు రెవెన్యూ అధికారుల కు వెంటనే అత్యవసరంగా పునరుద్ధరణ పనులను చేపట్టవలసిందిగా ఆదేశించినారు అలాగే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించవలసిందిగా మరియు తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలనిఆదేశించినారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్డిఓ వీణ, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజేందర్ రెడ్డి మున్సిపల్ ఇంజనీర్ శంకర్, వేణు ప్రసాద్, కామారెడ్డి డిప్యూటీ తహసిల్దార్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



## చెరువు కట్టలకు మరమ్మతు పనులు ఎప్పుడో?

రాజంపేట సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి). ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాజంపేట మండల కేంద్రంలోని ఊర చెరువు, దేవుని చెరువు పొంగిపొర్లడంతో గ్రామంలో వరదనీరు చేరింది. ఈ క్రమంలో అలుగుల వద్ద పేరుకున్న చెత్తను జెసిపి సాయంతో తొలగించారు. అయితే చెరువు కట్టలు దెబ్బతినడంతో కాలువ దాటడం రైతులకు పెద్ద ఇబ్బందిగా మారింది. వ్యవసాయ పనుల కోసం వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

నాగిరెడ్డిపేట్,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి): ఇళ్ల ముందు పార్క్ చేసిన ఆటోలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను నాగిరెడ్డిపేట్ పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు.ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన తాడేపల్లి కృష్ణ ప్యాసింజర్ ఆటోను అతని డ్రైవర్ అనీష్ నిత్యం నడుపుతుండేవాడని,ఈ ఆటో నడుపుతూ అనీష్ తన ఇంటి ఆవరణలో ఆటోను పార్క్ చేసి గేటుకు తాళం వేసేవాడని.కాగా గురువారం రాత్రి సమయంలో ఇంటి గేటు తాళం పగలగొట్టి ఆటోను దొంగతనం చేశారని యజమాని కృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతుండగా,శనివారం ఉదయం మాల్తుమ్మెద గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు భాగంగా తనిఖీలు నిర్వహించగా పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా పారిపోవడంతో వారిని వెంబడించి సిబ్బంది గంగారం,హెూం గార్డ్ బాలాజీలు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.వీరిని అదుపులో తీసుకోని విచారించగా నిజామాబాదు జిల్లా మంచిప్ప గ్రామానికి చెందిన కానుగుల రాజు(29), నిజామాబాదు జిల్లా గోపనపల్లి గ్రామానికి చెందిన కొల్ల దుర్గరాజు(30) ఇద్దరు కలసి 2 లక్షల 45 వేల విలువగల నాలుగు ఆటోలను దొంగినించినట్లు ఒప్పుకున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాలలో వీరిపై 20 కేసులు ఉన్నాయని అన్నారు. నాగిరెడ్డిపేట చాకచక్యంగా వ్యవహరించి అంతర్ జిల్లా దొంగలను పట్టుకున్న నాగిరెడ్డిపేట్ పోలీస్ సిబ్బంది గంగారాం,బాలాజీ లను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర క్యాష్ రివార్డ్ తో అభినందించారు.




## రెండో రోజుకు సైన్స్ ఫేర్



కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 13. (ప్రజాజ్యోతి) . స్థానిక శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హై స్కూల్ కామారెడ్డి లో మూడు రోజుల సైన్స్ ఫేర్ లో భాగంగా రెండవ రోజు 13/ 9 /2025 శనివారం రోజున అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ రాజు, (కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి) విచ్చేసి మాట్లాడుతూ ఇలాంటి సైన్స్ ఫేర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్నటువంటి సృజనాత్మకత తెలుస్తుందని తెలిపారు. ఇలాంటి ఇలాంటి సైన్స్ ఫెరు దేశ నూతన నిర్మాణానికి నూతన ఆవిష్కరణలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సైన్స్ ఫేర్ వీక్షించడానికి పట్టణంలోని వివిధ పాఠశాలలైన వాగ్దేవి విద్యాలయం, ఎస్. పి .ఆర్ స్కూల్, ఆర్చిడ్స్ స్కూల్, లిటిల్ స్కాలర్స్ స్కూల్ విద్యార్థులు రావడం జరిగింది తరువాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సూపర్ లను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు (ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్) శ్రీ గంగారెడ్డి, రెడ్డి, హరిస్మరణ, గీ రెడ్డి రాజి రెడ్డి,శ్రీ రంజిత్ మోహన్, భాస్కర్ రావు, శ్రీ గోవర్ధన్ రెడ్డి, వివిధ విభాగాల శైక్షణిక్ ప్రముఖ్ లు పాఠశాల ప్రిన్సిపల్ నాగభూషణం, అకాడమిక్ ప్రిన్సిపాల్ నాగేష్ , వివిధ పాఠశాలల మాతాజీలు, ఆచార్యులు పాల్గొన్నారు

## వివాహిత అదృశ్యం

నాగిరెడ్డిపేట్,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా కారణంగా ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెదలో చోటుచేసుకుంది. ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కవితకు మాల్తుమ్మెద గ్రామానికి చెందిన కర్రే రవితో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి ఇద్దరు సంతానం కలరు.గత సంవత్సరం జీవనోపాధికోసం భార్య భర్తలు ఇద్దరు హైదరాబాద్ కి వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు కాగా అక్కడ భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో భర్త రవికి చెప్పకుండా భార్య కవిత తన బంధువుల ఇంటికి వెళ్లిపోయింది.మూడు రోజుల క్రితం మాల్తుమ్మెద గ్రామానికి వచ్చి అక్కడి నుంచి పిల్లలను తీసుకోని గత నెల రాఖీ పండుగకి తన తల్లిగారి ఇల్లైనా నాగిరెడ్డిపేట్ గ్రామంకు వచ్చింది. అక్కడ తల్లి బోయిని పోచవ్వ కూతురు కవితను అడుగగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలుపడంతో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడిస్తా అని తెలుపడంతో వారం రోజుల పాటు ఉందని,ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవంకు పిల్లలను మాల్తుమ్మెద పాఠశాలకు పంపించామని,16 తేదీన అందరు కలిసి ఇంట్లో భోజనం చేసి నిద్రించామని ఉదయం లేచి సుచేసరికి నా కూతురు కవిత కనిపించకపోవడంతో నా అల్లుడు రవికి సమాచారం అందించామని,అప్పటి నుంచి ఆచూకీ కోసం చుట్టూ పక్కల వెతికిన బంధువులు,స్నేహితుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదని తల్లి పోచవ్వ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఇదేనా రైతు ప్రభుత్వం

## మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



మోర్తాడ్ సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి). ఒకవైపు యూరియా కొరత మరోవైపు రైతుబంధు ఎత్తివేత కానరాని బోనస్ అసంపూర్తి రుణమాఫీ ఇదేనా రైతు ప్రభుత్వం అంటూ నిప్పులు వెళ్లగక్కారు బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి. మోర్తాడ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని,రైతులు ఇబ్బంది పడుతున్న కూడ కాంగ్రెస్ ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టు ఉందని అన్నారు. మా అధినేత కేసీఆర్ చెప్పినట్టు కాంగ్రెస్ పార్టీ మళ్ళీ ఆనాటి రోజులు తెచ్చిందని ఆరోపించారు. ఇది రైతు రాజ్యం కాదని కాంగ్రెస్ పార్టీ దగా రాజ్యమని దుయ్యబట్టారు.కేసీఆర్ చేసిన అప్పులతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరిగితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అప్పుతో ఢిల్లీకి మూటలు పంపుడు తప్ప ఎం చేసాడని ఆరోపించారు. ఒక్క సంచి యూరియా కోసం అవస్థ పడుతున్న బస్తా కుడా దొరకని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. కాంగ్రెస్ పార్టీ కి ఓటేస్తే పాత రోజులు వస్థాయని కేసీఆర్ ఎప్పుడో చెప్పారని ఆ మాటలు నిజం అవుతున్నాయని అన్నారు. పంటల దిగుబడులు వచ్చే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో మందుల కొరత రైతులకు ఆందోళన గురించి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2 లక్షల రుణమాఫీని పూర్తి గా చేయకుండా రైతులను మోసం చేసారని,15000 రైతు భరోసా అని చెప్పి ఉన్న రైతుబందు ఎగొట్టారని, వడ్లకు 500 బోనస్ అని చెప్పారు దాని ఊసే లేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. వ్యవసయానికి 24 గంటల కరెంట్ అని చెప్పి రోజు నాలుగైదు సార్లు కోతలు పెడుతున్నారని ఆరోపించారు. రైతులకు చేయూతనివ్వలేదు కాని లక్ష యాభై వేల కోట్లతో మూసి రివర్స్ ఫ్రంట్ చేస్తా,లక్షల కోట్లతో ఫ్యూచర్ సిటీ కడతానంటూ ప్రగల్బాలు పలుకుతున్నాడని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు ఏండ్లలోనే 2 లక్షల 20 వేల కోట్లు అప్పు చేసిఏమి చేసిందని తట్టేడు మట్టి కూడ తీయలేదని ఆరోపించారు. ఇప్పటి కైనా కమిషన్ లు ఢిల్లీకి మూటలు పంపుడు లాంటి పనులు మాని పాలనపై ద్రుష్టి పెట్టి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు బిజెపి అండ



నిజామాబాద్ రూరల్: సెప్టెంబర్, 13 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో వరద బాధితులకు బిజెపి అండ. సిరికొండ గ్రామంలో భారీ వర్షాల కారణంగా ప్రాథమిక పాఠశాలలో పునరావాసం పొందిన బాధితులను శనివారం భారతీయ జనతా పార్టీ గ్రామ నాయకులు పరామర్శించారు. జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి సహకారంతో, నిజామాబాద్ జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు బాధితులకు ధైర్యం చెప్పి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ, ఆ దిశగా శ్రీ ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ నిరంతరం ముందుండి సహాయం అందిస్తున్నదని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిరికొండ మండల ప్రధాన కార్యదర్శి ధర్పల్లి బాబురావు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సూరి నీడ గోపి, కనగందుల గోపి, బూత్ అధ్యక్షులు వావిలాల అజయ్ కుమార్, బచ్చు మారుతి, కామాని కిరణ్, బందెల ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

# అవయవాలు దానం చేసిన కుటుంబాన్ని అభినందించిన ఎమ్మెల్యే



నిజామాబాద్ రూరల్: సెప్టెంబర్, 13 (ప్రజా జ్యోతి). అవయవాలు దానం చేసిన కుటుంబాన్ని అభినందించిన ఎమ్మెల్యే. నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బుర్ర రాజేష్ గౌడ్ మరణించిన అనంతరం అవయవాలు మరొకరికి దానం చేసిన వారి కుటుంబాన్ని అభినందించారు. ఎమ్మెల్యే మొదటగా రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శనివారం రాజేష్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భూపతి రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ.. ఒక మనిషి చనిపోయిన తర్వాత అవయవాలు దానం చేయడానికి వారి కుటుంబం ముందుకు రావడం ఎంతో కష్టంగా ఉన్న ఈ రోజుల్లో, రాజేష్ భార్య, తల్లిదండ్రులు మరియొక ప్రాణాలను కాపాడాలని అవయవాలు దానం చేయడానికి అంగీకరించినందుకు అభినందనీయమని అన్నారు. ఈ రోజుల్లో చాలామంది బ్రెయిన్ డెడ్ వల్ల చనిపోతున్నారని, వారి కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేయడానికి అంగీకరిస్తే, అతని వల్ల మరొక ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారని అన్నారు.కండ్లు, కాలేయం, కిడ్నీలు,గుండె వంటి అవయవాలను దానం చేసి ఇతరులను కాపాడమే అన్నారు. ఎన్నో సంస్థలు అవయవ దానాలపై అవగాహన ఈ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు వాసు బాబు, ధర్మ గౌడ్, శ్యామ్ సన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



నాగిరెడ్డిపేట్,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి): చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి చెందిన సంఘటన నాగిరెడ్డిపేట్ గ్రామంలో చోటుచేసుకుంది.ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల అనసూయ(79) గత పదిహేను రోజుల క్రితం రాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుండి బయట వెళ్ళింది. ఆ సమయంలో కాలు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి.దింతో వైద్య నిమిత్తం మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు శస్త్ర చికిత్స చేయగా ఆరోగ్య పరిస్థితి సహకరించకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతుండగా మా అమ్మమ్మ మృతి చెందినట్లు బాలాజీ శ్రీకాంత్ ఫిర్యాదులో పేర్కొన్నారు.బాలాజీ శ్రీకాంత్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## నీరు చేరకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలి




నిజామాబాద్ రూరల్: సెప్టెంబర్, 13 (ప్రజా జ్యోతి). నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని 33/11 కేవీ, 132/33 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ఎల్లమ్మ చెరువు అలుగునీరు చేరింది. ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో రాత్రివేళ పాములు రావడం ప్రారంభించాయని, ఈ కారణంగా సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారని వారు తెలిపారు. అంతేకాకుండా, సబ్‌స్టేషన్‌లో తరచుగా కరెంట్ ట్రిప్ అయ్యే పరిస్థితులు ఎదురవుతుంటే, మళ్లీ కరెంట్ వేసే సమయంలో సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. వర్షం కారణంగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారి, సిబ్బంది తమ విధులు నిర్వహించడంలో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు.సబ్‌స్టేషన్ సిబ్బంది సంబంధిత ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేసి, నీరు చేరకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా విద్యుత్ శాఖ సిబ్బందికి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పెద్ద వాల్గోట్ లో ఇండ్లల్లోకి మళ్లీ నీళ్లు

నిజామాబాద్ రూరల్: సెప్టెంబర్, 13( ప్రజా జ్యోతి) . నిజామాబాద్ జిల్ల సిరికొండ మండలం పెద్ద వాల్గోట్ గ్రామం వరద విపత్తులతో మరోసారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కురిసిన భారీ వర్షానికి వరదలతో వాల్గోట్ కాలనీ ముంచివేసింది అది గడచి సరిగ్గా శుక్రవారం 14 రోజుల భారీవర్షాల కారణంగా అనేక కుటుంబాలు నష్టపోయిన సంగతి తెలిసిందే. కానీ, వరుణుడు మళ్లీ శుక్రవారం సాయంత్రం నుండి కురిసిన భారీ వర్షానికి గ్రామాన్ని ముంపులో కినెట్టేసింది. శుక్రవారం రాత్రి పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితిని గమనించిన గ్రామపంచాయతీ సిబ్బంది తక్షణమే స్పందించి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తాత్కాలిక నివాసం కల్పించడం, తాగునీరు, అవసరమైన సరుకులు అందించడం వంటి చర్యలు చేపట్టారు. మండల అధికారుల ఆదేశానుసారం కారోబారు పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది సహాయక కార్యక్రమాలు నిర్వహించారు.గ్రామస్థులు తక్షణ సహాయం అందించిన పంచాయతీ సిబ్బందిని అభినందిస్తూ, అయితే ప్రభుత్వం నుంచి మరింత స్థాయిలో ఆర్థిక సహాయం అత్యవసరమని కోరుతున్నారు.



# ఇండ్లలోకి నీళ్లు రాకుండా శాశ్వత మార్గం చూపాలి



నిజామాబాద్ రూరల్: సెప్టెంబర్, 13 (ప్రజా జ్యోతి) .ఇండ్లలోకి నీళ్లు రాకుండా శాశ్వత మార్గం చూపాలి. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాళ్ల రామడ్గు గ్రామం లో శుక్రవారం రాత్రికి కురిసిన భారీ వర్షం గ్రామస్థుల జీవనాన్ని స్తంభింపజేసింది. వర్షపు నీరు నేరుగా ఇళ్లలోకి చేరి గృహిణులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా అడ్డంకులు ఏర్పడ్డాయి. కార్లు, బైకులు నీళ్లలో ఇరుక్కుపోతూ ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు. చదువుకోడానికి బయలుదేరే పిల్లలు, ఇతర గ్రామాలకు వెళ్లే వారు కూడా ఈ దారినే ఆధారపడాల్సి రావడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గ్రామస్థురాలు బొక్కల నర్సవ్వ మాట్లాడుతూ...డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం వల్లే ఇళ్లలోకి నీళు వస్తున్నాయి. వర్షం కురిసినా ప్రతిసారి ఇదే పరిస్థితి. చిన్నపిల్లలతో ఇళ్లలో ఉండడమే కష్టంగా మారుతోంది. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని శాశ్వత పరిష్కారం చూపాలి అని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామస్థులు సాయిరి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వర్షం వస్తే ఇల్లు, రోడ్డు అన్నీ నీటమునిగిపోతాయి. అయినా అధికారులు వస్తూ చూసి వెళ్లిపోతారు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల ప్రాణాలు పోయాకనా మేల్కొంటారా? అని ప్రశ్నించారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, రోడ్ల మరమ్మత్తులు చేపట్టడం అత్యవసరం. లేని పక్షంలో ప్రజలు తీవ్ర ఆందోళనలకు దిగుతామని గ్రామస్థులు హెచ్చరించారు. రోడ్డు దగ్గర నుండి కప్పల వాగులకు 500 మీటర్ల పైప్ లైన్ వేస్తే నీళ్లు రాకుండా శాశ్వత మార్గం ఏర్పడుతుందని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని రామడ్గు లోకి నీళ్లు రాకుండా విధాల ఆదుకోవాలని ఆయన గ్రామ ప్రజల తరఫున ప్రభుత్వానికి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ఇండ్లలోకి వర్షపు నీరు

నిజామాబాద్ రూరల్: సెప్టెంబర్, 13 (ప్రజా జ్యోతి)..నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని న్యావనంది గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కిందివాడకట్టు చెరువు తూము కాలువ పక్కన ఉన్న ఇండ్లలోకి వర్షపు మీరు వచ్చి చేరింది. గ్రామంలో సగం డ్రైనేజ్ నీరు ఊర చెరువు ప్రధాన కాలువ ద్వారా వెళుతున్నాయి. నీళ్లు వెళ్లడానికి వెడల్పైన కాలువ లేక ఇండ్లలోకి నీళ్లు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాల నుండి ఇదే కాలువ నుండి మురికి నీళ్లు వెళుతున్నాయి. అధికారులు ఈ ప్రధాన తూమ్ కాలువను వెడల్పు ఎత్తు పెంచితే మురికి కాలువ నీరు ఇండ్లలోకి రాకుండా వెళుతుందని గ్రామస్తులు తెలిపారు.





## పోచారం ప్రాజెక్ట్‌లోకి ఇన్ ఫ్లో

నాగిరెడ్డిపేట్,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి) నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌కు వరద కొనసాగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్ లోకి 3,230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ డి ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. అంతేమొత్తంలో నీరు ప్రాజెక్ట్‌పై నుంచి పొంగి,నిజాంసాగర్ ప్రాజెక్ట్ లోకి కలుస్తుందని, డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.82 టీఎంసీలు కాగా.. నిండుకుండలా నిండి జలకళను సంతరించుందని దింతో ప్రాజెక్ట్ అలుగు పై నుంచి నీరు పారుతోంది.ఈ వర్షాకాలంలో 21.68 టీఎంసీల నీరు నిజాంసాగర్ ప్రాజెక్ట్ లోకి వెళ్లిందని డిఈ తెలిపారు.